

గ్లోబల్ సమ్మిట్ పనులను మ్యాప్‌లో పరిశీలిస్తున్న వేం నరేందర్‌రెడ్డి, శశాంక, సుధీర్‌బాబు

గ్లోబల్ సమ్మిట్ పనులను వేగవంతం చేయాలి

» సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

కందుకూరు, డిసెబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డిసెంబర్ 8, 9 తేదీల్లో కందుకూరు మండలంలో చేపడుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఫ్యూచర్ సిటీ అథారిటీ ఎండీ శశాంక, రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబుతో కలిసి మండలంలోని మీర్కాన్‌పేటలో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ సమ్మిట్ - 2025 పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 30 దేశాలతోపాటు మన దేశం నుంచి వచ్చే 2,500 మంది పారిశ్రామికవేత్తలు, పెట్టుబడుదారులకు సదుపాయాలను కల్పించడంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు అనుకూలంగా భూములు ఉన్నాయని తెలిపారు. ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి వారికి భూములు కేటాయించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. అనంతరం బేగరికంచలో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ అథారిటీ కమిషనరేట్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సమావేశాలపై రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నాలుగు రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఆర్టీసీ డిపో పరిధిలో బస్సు సర్వీసుల్లో నెలకొన్న సమస్యలను తెలపడానికి గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ ఉష బుధవారం ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో 99592 26287 నంబరుకు ఫోన్ చేసి సమస్యలతోపాటు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రైతును మించిన శాస్త్రవేత్త లేరు

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


నందిగామ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతును మించిన శాస్త్రవేత్త లేడని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కన్హా శాంతివనంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా కిసాన్ మేళా సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో భారతదేశం ఆహార పంటలకు కేంద్ర బిందువుగా మారుతుందన్నారు. రైతులు సమీకృత వ్యవసాయం, వైవిధ్యభరితమైన పంటలు, చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మెరుగైన వ్యవసాయ సాధనాలు, మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందజేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతు ఉత్పత్తిదారులతో ఆధునిక సేంద్రియ వ్యవసాయంపై చర్చించారు. మహా కిసాన్ సమ్మేళనంలో వివిధ రాష్ట్రాల నుంచి ఐదు వేల మంది రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. పలు విత్తన, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పనిముట్లు యంత్రాల పరిశ్రమల వారు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం చైర్మన్ కోదండరెడ్డి సభ్యులు ఎంఎస్ రెడ్డి, ప్రవేశ్ శర్మ, యుగేందర్, కృపాకర్‌రెడ్డి, సత్యనారయణ, యాదగిరి, రమేష్, మాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో అభ్యర్థులు పూర్తిస్థాయి ప్రచారానికి దిగారు. నామినేషన్ల ఉపసంహరణకు బుధవారం గడువు ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులతో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొంది.

- తొలి విడత ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
- చివరివరకు ఏకగ్రీవాలకు పలువురి యత్నం
- బరిలో నుంచి తప్పించేందుకు ప్రత్యర్థులకు తాయిలాలు
- జిల్లాలో ఆరు పంచాయతీలు ఏకగ్రీవం
- ఊరూరా ఎన్నికల సందడి

సమరానికి సై



నేటి నుంచి జోరందుకోనున్న ఎన్నికల ప్రచారం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

తొలివిడత జిల్లాలో 174 సర్పంచ్ స్థానాలతోపాటు 1,530 వార్డుల్లో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయగా, ఇందులో ఆరు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 168 పంచాయతీ సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటికి సంబంధించి ఈనెల 11వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే వెంట వెంటనే ఫలితాలు ప్రకటించనున్నారు. అంతేకాకుండా అదేరోజు ఉప సర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహించనున్నారు.

ప్రత్యర్థులను తప్పించేందుకు..

పంచాయతీ తొలి విడత నామినేషన్ల ఉసంహరణకు చివరి రోజైన గురువారం పలు చోట్ల నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. తమకు పోటీగా నామినేషన్లు వేసిన వారిచేత నామినేషన్లు ఉపసంహరింపచేసి ఏకగ్రీవం చేసుకునేందుకు పలువురు చివరి క్షణం వరకు ప్రయత్నించారు. బరిలో నుంచి తప్పుకుంటే తాయిలాలు ఇస్తామంటూ

మిగతా 8వ పేజీలో...

తొలి విడత ఇక్కడే..

తొలి విడత షాద్‌నగర్, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ఏడు మండలాల్లో 168 పంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. కొత్తూరు మండలంలో 12 పంచాయతీల్లో 110 వార్డులు, నందిగామ మండలంలో 18 పంచాయతీల్లో 170 వార్డులు, కేశంపేట్ మండలంలో 28 పంచాయతీల్లో 260 వార్డులకు, సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కొందుర్గు మండలంలో 19 పంచాయతీల్లో 186 వార్డులు, చౌదర్‌గూడ మండలంలో 24 పంచాయతీల్లో 204 వార్డులు.. ఫరూఖ్‌నగర్ మండలంలో 46 పంచాయతీల్లో 410 వార్డులు, శంషాబాద్ మండలంలో 21 పంచాయతీల్లో 190 వార్డులకు, సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.

విలీనం.. అధికారికం

- జీహెచ్‌ఎంసీలోకి మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు
- రంగంలోకి బల్దియా.. రికార్డుల స్వాధీనం
- బ్యాంకు ఖాతాల స్తంభన.. డీఎంసీలకు బాధ్యతలు
- కార్యాలయాలకు అధికారులు.. సమగ్ర సమాచారం సేకరణ

7

హిందువులకు సీఎం క్షమాపణ చెప్పాలి

» చేవెళ్లలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన బీజేపీ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లను అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ చేవెళ్ల మున్సిపాల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా సీనియర్ నాయకుడు కుంచం శ్రీనివాస్‌గుప్తా డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నతమైన హోదాలో ఉండి సీఎం హిందువుల మనోభావాలను కించపరిచేలా మాట్లాడారని, అలాంటి ప్రసంగాలను మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ సంస్కృతి, గౌరవం, ఆధ్యాత్మిక విలువలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేస్తే ప్రజలు ప్రశ్నించకుడా ఉండరని స్పష్టం చేశారు. హిందూ సమాజానికి సీఎం వెంటనే క్షమపణలు చెప్పాలన్నారు. లేనిపక్షంలో కాషాయ దళం రుచి చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవుని శర్వలింగం, చీర శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, బండారి చంద్రశేఖర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, వడ్డే గణేశ్, రాఘవేందర్ ప్రకాశ్, కుమార్, ధనుష్‌రెడ్డి, సాయి, రాజు, రవి, శివ, జయసింహరెడ్డి, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



వైభవంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి పరిణయం

» పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తజనం

» హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

తలకొండపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం రాంపూర్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తుల కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాంపూర్‌తోపాటు తలకొండపల్లి, మిడ్జిల్, కేశంపేట, ఉర్కొండపేట మండలాలతోపాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పవన్‌కుమార్ రెడ్డి, ఈవో స్నేహలతల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు, వేద బ్రహ్మణులు, పండితులు, అర్చకులు స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్, మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన భక్తులు



ఇబ్రహీంపట్నం మండలం చెర్లపటేల్‌గూడలో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న శ్రీరాములు

తుది విడత మొదటి రోజు

» 174 సర్పంచ్ స్థానాలకు 163

» 1,598 వార్డు స్థానాలకు 398 నామినేషన్లు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల తుది విడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు ఏడు మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి అధికారులు నామినేషన్లు స్వీకరించారు.

ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ తోపాటు కందుకూరు డివిజన్ల పరిధిలోని మహేశ్వరం, కందుకూరు మండలాల్లో మొత్తం 174 సర్పంచ్ స్థానాలకుగాను 163 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా 1,598 వార్డులకుగాను 398 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో మండల ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ, తహసీల్దారు సునీతా రెడ్డి నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించారు. ఆయా మండలాల్లో ఎన్నికల అధికారులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

మూడో విడత మొదటి రోజు నామినేషన్ల వివరాలు..

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
ఇబ్రహీంపట్నం	14	12	144	32
మంచాల	23	15	216	29
యాచారం	24	14	232	35
అబ్దుల్లాపూర్‌మెట్	14	14	134	77
మాడ్గుల	34	29	302	48
కందుకూరు	35	39	312	70
మహేశ్వరం	30	40	258	107
మొత్తం	174	163	1,598	398



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

కేంద్రానికి చేరుకున్న గన్నీ బ్యాగులు

» ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ఎట్టకేలకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కేంద్రంలో గన్నీ బ్యాగుల కొరతతో నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లపై బుధవారం ధాన్యం.. దైన్యం శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు, పీఏసీఎస్ పాలకవర్గం స్పందించింది. పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్, సీఈవో దేవేందర్ చొరవతో కొనుగోలు కేంద్రానికి పౌరసఫరాల శాఖ నుంచి ఐదు వేల గన్నీ బ్యాగులు వచ్చాయి. దీంతో మూడు రోజులుగా నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకే హమాలీలు తూకాలు ప్రారంభించారు. మూడు వేల బ్యాగుల ధాన్యాన్ని తూకం వేసినట్లు కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు మహేశ్ తెలిపారు. అదనంగా మరో పది వేల గన్నీ బ్యాగులకు ఇండెంట్ పెట్టారు. చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని వెంకటేశ్ కోరారు. పొగ మంచు, వాతావరణంలో మార్పులతో ధాన్యంలో తేమ శాతం రాక కొనుగోళ్లలో కొంత జాప్యం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కాగా, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

వామ్మో ఈగలు

ఎక్కడ చూసినా ముసురుకుంటున్నాయ్..

- గ్రామ సమీపంలో వందల ఎకరాల్లో కోళ్ల ఫాం
- అన్నం సైతం తినలేకపోతున్న జనం
- స్థానికంగాశుభకార్యాలు చేసుకోలేని దైన్యం
- ఇబ్బందులు పడుతున్న కొత్తగూడ ప్రజలు



కొత్తగూడలోని ఓ ఇంట్లో గిన్నెలపై వాలిన ఈగలు

కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇవి ఎస్ఎస్ రాజమౌళి సృష్టించిన ఈగలు కాదు. వందల ఎకరాల్లో విస్తరించిన కోళ్ల ఫాంల నుంచి వచ్చి ముసురుకుంటున్న కీటకాలు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తగూడలో ఈగల బెడద అధికమైంది. వండుకునేటప్పుడు.. భోజనం చేసేటప్పుడు విపరీతంగా వచ్చి వాలుతున్నాయి. దీంతో పిడికెడు మెతుకులు సైతం తినలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుభకార్యం చేసుకోవాలంటే ఈగల భయానికి హైదరాబాద్‌లోని పలు ఫంక్షన్‌హాళ్లకు వేలకు వేలు చెల్లించుకుంటూ అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు.

ఎక్కడ చూసినా ఈగల గుంపే..

కొత్తగూడ గ్రామానికి సమీపంలో మద్దుల శ్రీకాంత్‌రెడ్డి కోళ్ల ఫారం వంద ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని కారణంగా గ్రామంలో ప్రతి

మిగతా 8వ పేజీలో...



కొత్తగూడలో ఓ ఇంటి ఆవరణలో వాలిన ఈగలు

పట్టించుకోకపోతే ఉద్యమమే..



గ్రామంలో ఈగల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. కనీసం అన్నం సైతం తినలేకపోతున్నాం. ఈగల బెడదతో వేగలేకపోతున్నామని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం చేపడుతాం.

- సాధ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్, కొత్తగూడ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా.. నిర్మాతలకు కాసుల పంట పండించి ఉండొచ్చు. అల్లు అర్జున్‌ను పాన్ ఇండియా స్టార్‌గా మరో మెట్టు ఎక్కించి ఉండొచ్చు. కానీ, ఒక కుటుంబానికి మాత్రం జీవిత కాలపు పీడకలను మిగిల్చింది. రెండు తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా కలవర పెట్టిన ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ దుర్ఘటన జరిగి బుధవారంతో ఏడాది అవుతోంది. అమ్మ, నాన్న, చెల్లితో కలిసి తన అభిమాన నటుడి సినిమా చూడడానికి వెళ్లిన పదేళ్ల శ్రీతేజ్.. తొక్కిసలాటలో తల్లిని కోల్పోయాడు. అదే ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్.. తన తల్లి ఇక లేదన్న సంగతి కూడా గుర్తించలేని స్థితిలో మంచం మీద నిశ్చేష్టంగా పడి ఉంటున్నాడు. ప్రమాదం జరిగి ఏడాది అవుతున్నా.. ఇంకా ఆ కుటుంబం కోలుకోకపోగా మరింత దుఃఖంలో కూరుకుపోయింది. ఆస్పత్రి నుంచి శ్రీతేజ్ ఆరు నెలల కిందట డిశ్చార్జి అయ్యాడు కానీ, అతని ఇల్లే ఇప్పుడు దవాఖానాగా, మారింది. తండ్రే నర్సు అయి నిరంతరం సపర్యలు చేస్తున్నారు. శ్రీతేజ్ తనంతట తానుగా అన్నం తిన లేడు. అందుకే కడుపులోకి నేరుగా ద్రవాహారాన్ని పంపించేందుకు గ్యాస్ట్రోస్టోమీ పైపు అమర్చారు. శ్వాసకూడా తీసుకోలేడు. దాంతో గాలి నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడానికి మెడ ముందు భాగంలో రంధ్రం చేసి ట్రాకియోస్టోమీ ట్యూబ్ పెట్టారు. దీంతో శ్రీతేజ్ ఒంటినిండా ట్యూబులతో పొత్తిళ్లలో పసిబిడ్డలా ఉలుకూ పలుకూ లేకుండా పడి ఉంటున్నాడు.

ప్రతిరోజూ థెరపీలు..

శ్రీతేజ్ ఆకలి అని సైగ కూడా చేయలేడు. తొక్కిసలాటలో చిన్నారి మెదడు కణాలు 70 శాతం దెబ్బతినడమే ఇందుకు కారణం. తన చిటికెన వేలు పట్టుకొని నడవాల్సిన బాబును చేతుల్లోకి ఎత్తుకొని మోయాల్సి వస్తోందంటూ శ్రీతేజ్ తండ్రి కన్నీటి పర్యంతమయ్యారు. "రోజూ సికింద్రాబాద్‌లోని ఆసియా ట్రాన్స్‌కేర్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో కొన్ని నెలలుగా బాబుకు స్వాలో(మింగడం), స్పీచ్(మాట్లాడటం) థెరపీ ఇప్పిస్తున్నాం. అక్కడే అడ్మిట్ చేస్తే నెలకు రూ.90 వేలకు పైగా ఫీజు చెల్లించాలి. బాబును చూసుకోడానికి ఒక మనిషి అక్కడే ఉండాలి. ఇంట్లో 6ఏళ్ల నా కూతురు, 75 ఏళ్ల మా అమ్మ బాగోగులు కూడా నేనే చూసుకోవాలి. ఇంటి పనులు చక్కబెట్టుకొని.. పాపను స్కూలుకు పంపించిన తర్వాత దిల్‌సుఖ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు రోజూ క్యాబ్‌లో బాబును తీసుకొచ్చి థెరపీలు ఇప్పిస్తున్నాను. రోజుకు రూ.2 వేల చొప్పున థెరపీలకే రూ.60 వేలకుపైన కడుతున్నాను. ఫిజియోథెరపీ చేయిస్తున్నాం. అదీ రూ.30 వేలవరకు అవుతుంది. ప్రతి నెలా కేవలం థెరపీలకే తక్కువలో తక్కువ రూ.90 వేలు కడుతున్నాను. కనీసంగా 2 నుంచి 3 ఏళ్లు నిరంతరం థెరపీలు ఇప్పిస్తే బాబు కోలుకోవచ్చని డాక్టర్లు చెప్పారు" అని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ వివరించారు.

శ్వాస తీసుకోలేడు..
అన్నం తినలేడు

- ఏడాది గడిచినా దయనీయ స్థితిలోనే శ్రీతేజ్
- ఒంటినిండా ట్యూబులతో మంచంపై నిశ్చేష్టంగా
- పైపుతో ద్రవాహారం.. ప్రతి రోజూ థెరపీలు
- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు ఏడాది
- కొడుకు కోసం ఉద్యోగం మానేసి తండ్రి సపర్యలు
- నెలకు రూ.1.50 లక్షల దాకా అవుతున్న ఖర్చు



కొడుకు కోసం ఉద్యోగం వదిలేసి...

శ్రీతేజ్‌కు ప్రతి మూడు గంటలకు ఒకసారి గ్యాస్ట్రో స్టోమీ ట్యూబ్ ద్వారా ద్రవాహారం అందిస్తుండాలి. ప్రతి రెండు గంటలకు ఒకసారి మెడ దగ్గర అమర్చిన ట్రాకియోస్టోమీ పైపులోని తెమడ వంటి ద్రవాన్ని శుభ్రం చేయాలి. నిరంతరం డైపర్లు మారుస్తుండాలి. నిత్యం వేడినీళ్లతో ఒళ్లు తుడిచి దుస్తులు వేయాలి. ఇవన్నీ చేయాలంటే ఇద్దరు మనుషుల పర్యవేక్షణ అవసరం. ఇదంతా చేయడానికి ఇంటిపట్టున ఉండే శ్రీతేజ్ నాయనమ్మకు అసాధ్యం. "ఇదివరకు బంగారం దుకాణంలో పనిచేసేవాడిని. అదే నా కుటుంబానికి ఆదరువు. ప్రమాదం తర్వాత మా జీవితం తలకిందులయింది. బాబును చూసుకోడానికి ఇంటిపట్టునే ఉంటున్నాను. మరోపక్క మా అమ్మాయిని కూడా సముదాయించాలి. ఇప్పటికి ఒక్కోరోజు అర్ధ రాత్రి నిద్రలేచి అమ్మా అని పాప ఏడుస్తుంటుంది" అని చెబుతూ భాస్కర్ కన్నీటిపర్యంతమయ్యారు. ఏప్రిల్‌లో శ్రీతేజ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయినప్పటి నుంచి క్రమం తప్పకుండా థెరపీలు ఇప్పించడం వల్ల కొంచెం మార్పు కనిపిస్తోందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రమాదం అనంతరం శ్రీతేజ్ కాళ్లు పూర్తిగా ముడుచుకుపోవడంతో జూన్‌లో మరొక ప్రైవేటు ఆస్పత్రిలో కాళ్లకు శస్త్రచికిత్స చేయించారు. "కాళ్లకు ఆపరేషన్‌తో పాటు ఇప్పటివరకు థెరపీలకు రూ.20లక్షలు చెల్లించాం. శ్రీతేజ్‌కు థెరపీలు, ఇతర మందులు, డైపర్లు, ప్రత్యేకమైన ఆహారం వంటివన్నీ కలిపి నెలకు రూ.1.25 లక్షలు పైన ఖర్చు అవుతుంది. ఇక ఇంటి అద్దెతోపాటు పాప చదువుకు, అమ్మ మందులకు అయ్యేదంతా అదనం" అని శ్రీతేజ్ బాబాయి మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేశారు.

తమదే బాధ్యత అని చెప్పారు కానీ..

తొక్కిసలాటలో తన భార్య చనిపోవడంతో.. జరగరాని నష్టం జరిగిందంటూ అల్లు అర్జున్ కుటుంబం తన పిల్లల పేరుమీద రూ.2 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ చెప్పారు. ఆ మొత్తానికి నెల నెలా బ్యాంకు వడ్డీ తీసుకునే అవకాశం కల్పించారని, కానీ.. ఆ వడ్డీ డబ్బులు.. బాబు వైద్య చికిత్స ఖర్చులకు ఏమాత్రం సరిపోవడంలేదని అన్నారు. నెలకు రూ.2 లక్షల ఖర్చుకుతోడు జూన్‌లో బాబు కాళ్లకు ఆపరేషన్ చేయించినప్పుడు అదనంగా రూ.3 లక్షలు ఖర్చయ్యాయని తెలిపారు. బాబుకు సపర్యలు చేసేందుకు, చికిత్స చేయించేందుకు ఉద్యోగం కూడా మానేయడంతో ఎటువంటి ఆదాయం లేదని పేర్కొన్నారు. శ్రీతేజ్ ఆస్పత్రిలో ఉన్న సమయంలో.. అతడు పూర్తిగా కోలుకునే దాకా తమదే బాధ్యత అని, వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులన్నీ భరిస్తామని అల్లు అర్జున్ కుటుంబం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇదే విషయమై అల్లు అర్జున్‌కు గుర్తు చేసేందుకు ఆయన మేనేజర్ కాంతారావును సంప్రదించగా.. సానుకూల స్పందన రాలేదని తెలిపారు. కనీసం బాబు థెరపీల ఖర్చు వరకైనా సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీసీఐ కర్మాగార అభివృద్ధికి
రూ.వంద కోట్లు ఇవ్వండి

తాండూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే పెద్ద పరిశ్రగా వెలుగొందిన వికారాబాద్ జిల్లాలోని కరన్‌కోట్ సీసీఐ కర్మాగార ఆధునికీకరణకు సహకరించాలని కర్మాగార అధికారులు బుధవారం కేంద్ర మంత్రి, ఎంపీని వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. కర్మాగారం అధికారులు ఢిల్లిలో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిలను కలిసి కర్మాగార డెవలప్‌మెంట్ కోసం రూ.100కోట్లు కేటాయించాలని కోరారు. ప్యాకింగ్ ప్లాంట్, సిమెంట్, కోల్ మిల్, కింక్లర్ విభాగా ఆధునికీకరణకు నిధులివ్వాలని కోరారు. 40సంవత్సరాల క్రితం కర్మాగారం ఏర్పాటు చేశారని, ప్రస్తుతం యంత్రాలన్నీ రిపేర్లకు వచ్చాయని, ప్రైవేటు కంపెనీలకు దీటుగా కరన్‌కోట్ సిమెంట్ కర్మాగారాన్ని రెన్యోవేషన్ చేయాల్సి ఉందన్నారు. దీనికి మంత్రి, ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు అధికారులు పేర్కొన్నారు.


కేంద్ర మంత్రి కుమారస్వామిని కలిసిన సీసీఐ అధికారులు



అవగాహన కల్పిస్తున్న రాచకొండ ఏహెచ్‌టీయూ పోలీసులు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ఘట్‌కేసర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులు, నిర్బంధ కార్మికులు, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాచకొండ కమిషనరేట్ ఎస్ఐ ఎండీ ఖలీల్ అహ్మద్ అన్నారు. బుధవారం అన్నోజిగూడ జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు వివిధాంశాలపై అవగాహన కల్పించారు. మహిళలను మోసగించినా, అపహరించినా కఠిన శిక్షలుటాయని గుర్తుచేశారు. సైబర్ బెదిరింపులు, మోసాలకు గురైతే డయల్ 1930, ఉమెన్ హెల్ప్‌లైన్ 1091, 181, చైల్డ్ హెల్ప్‌లైన్1091, 112, డయల్ 100 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు రంగారెడ్డి, మీనాకుమారి, సిబ్బంది భానుప్రసాద్, రజిత, హెచ్ఎం ప్రతాపరెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్నాలజీని వినియోగిస్తేనే దేశం అభివృద్ధి

ఘట్‌కేసర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): డిజిటల్ యుగంలో టెక్నాలజీని సృజనాత్మకంగా వినియోగిస్తేనే ప్రపంచంలో దేశం ముందంజ వేస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యా కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. బుధవారం కొండాపూర్‌లో గల సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ సంస్థల ఆధ్వర్యంలో బిల్డ్-ఎ థాన్ అధ్యాపకులకు శిక్షణ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. సాంకేతికతను సమర్థంగా ఉపయోగించుకోవడం విద్యార్థుల భవిష్యత్తుకు కీలకం అన్నారు. కొత్తకొత్త ప్రయోగాలు చేపట్టాలని సూచించారు. శిక్షణలో 200మంది అధ్యాపకులు పాల్గొన్నారు. శిక్షణను పూర్తి చేసిన 60మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హా, కళాశాల చైర్మన్ ఏవీ రమాణారెడ్డి, డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జానకిరాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి

అనురాగ్‌లో 'అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ డే'

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో బుధవారం వ్యవసాయ విద్యాదినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. వర్సిటీ డీన్ నారాయణరెడ్డి దేశం అగ్రి రంగంలో సాధించిన పురోగతిని విద్యార్థులకు తెలియజేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ విడమర్చిన అంశాలపై వివరించారు. వ్యవసాయం బాగుంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, పండ్ల తోటలు, మ్యూజియం, పాలి హౌజ్‌లను విద్యార్థులు సందర్శించారు.


ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

వికారాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు చేసే మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం వికారాబాద్‌లోని విశ్వభారతి కళాశాలలో 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్'పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో లింకులు, సందేశాలు, నకిలీ మెయిల్ పంపి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వాట్సాప్ లింకులు, సందేశాలకు స్పందించొద్దన్నారు. మోసపోతే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ సెంటర్ 1930కు కాల్ చేయాలని తెలిపారు. తాము సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటామని, మోసాలకు గురికామని అప్రమత్తం అవుతామని విద్యార్థులు, కళాశాల సిబ్బందితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో భీంకుమార్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, భీంకుమార్

హిందువుల మనోభావాలను దెబ్బతీసిన సీఎం

మేడ్చల్ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందువులు ఆరాధించే దేవతల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని మేడ్చల్ పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజహరినాథ్ అన్నారు. బుధవారం మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో బీజేపీ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. శైలజ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి దేవతల పట్ల అనుచిత వాఖ్యలు చేసి హిందువులందరినీ అవమానించాడన్నారు కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జగన్‌గౌడ్, ప్రేమ్‌దాస్, హంసరాణి కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వంశీ, సుధాకర్‌రెడ్డి, మురళీధర్ పాల్గొన్నారు.

హిందూ దేవుళ్లపై సీఎం వ్యాఖ్యలు సరికాదు

కేశంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం హోదాలో రేవంత్ రెడ్డి హిందు దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా సంస్కృతిక శాఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి అన్నారు. కేశంపేట మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేష్, కుమార్ గుప్తాతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేసినట్లు ఇతర మతాల దేవుళ్లపై చేస్తాడా.. అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అంటే ముస్లింల పార్టీ అని నిరూపించుకుందని విమర్శించారు. రాజకీయంలో ఓ వర్గం మద్దతు కూడగట్టేందుకు ఇంతలా దిగజారడం కాంగ్రెస్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు. హిందువులపై ఇంతగా ద్వేషం ఎందుకు నింపుకున్నారో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇకనైనా హిందువులు, హిందూ దేవుళ్లను కించపరచడం మానుకోవాలని సూచించారు.


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

మేడ్చల్ టౌన్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీజేపీ సోషల్ మీడియాతో వక్రీకరించి రాష్ట్రంలో మత విద్వేషాలు పెంచే యత్నం చేస్తోందని మేడ్చల్ నియోజకవర్గం ఎ-బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కుమార్ అన్నారు. బీజేపీ నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేయడంపై మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పక్కనపెట్టి కులమతాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ రాజకీయ లబ్ధికి యత్నిస్తోందని అన్నారు.

పోటీ లేకుండా ఉండేందుకు...
పార్టీ నుంచి ఒక్క అభ్యర్థే ఉండేలా నాయకుల మంతనాలు

కులకచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పోటీ లేకుండా కాంగ్రెస్ నాయకులు అభ్యర్థుల మధ్య రాజీ కుదుర్చుతున్నారు. బుధవారం నుంచి సర్పంచ్, వార్డులకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇప్పటికే గ్రామాల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితా నాయకుల వద్ద ఉంది. పార్టీ నుంచి గ్రామానికి ఇద్దరు, ముగ్గురు పోటీ పడుతున్నారు. వారిలో ఒక్కరే పోటీలో ఉండేలా డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ ప్రయత్నాలు చేస్తున్నారు.



ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలి

చౌదరిగూడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని చౌదరిగూడ, ఇంద్రనగర్‌లో పోలీస్ శాఖ ఆదేశాల మేరకు సిబ్బందితో రెండు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించుకునేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఏఎస్ఐ చక్రీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


చౌదరిగూడలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు కూడా
స్వస్తిక్ గుర్తునే వాడాలి
- ఎంపీడీవోకు యూటీఎఫ్ నాయకుల వినతి

బొంరాస్‌పేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ద్వారా కాకుండా స్వస్తిక్ గుర్తుతో ఓటు వేసే అవకాశం కల్పించాలని బొంరాస్‌పేట్ మండల ఎంపీడీవో వెంకన్నగౌడ్‌కు యూటీఎఫ్ నాయకులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఫెడరేషన్ మండల అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ, ఉపాధ్యాయులు వేసే పోస్టల్ బ్యాలెట్లలో కూడా సాధారణ ఓటర్లు వేసినట్టే స్వస్తిక్ గుర్తుతో వేసేలా అవకాశం ఇవ్వాలని కోరారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత మొదట పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు కాబట్టి ఉద్యోగులు సంతకంతో వేసే రహస్య ఓటు ద్వారా ఓటు ఎవరికి వేశారో బహిర్గతం అవుతుందని, ఇలా కాకుండా స్వాస్తిక్ సింబల్ వాడితే సంతకం లేకుండా అందరి గుర్తు ఒకేలా ఉంటుంది కాబట్టి ఏ ఉద్యోగి ఎవరికి ఓటు వేశారో తెలియదని అన్నారు. ఓటు ఎవరికి వేశారో బహిర్గతమైతే సొంతూళ్లలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అభ్యర్థులతో ఇబ్బందులు ఏర్పడతాయన్నారు.



కొత్తూర్ మండలంలో 22 మంది వార్డు సభ్యుల ఏకగ్రీవం
- మక్తగూడ జీపీలో 8 వార్డులకు 7 ఏకగ్రీవం

కొత్తూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామపంచాయతీలలో 110వార్డులు ఉండగా, 224మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 22వార్డులు ఏకగ్రీవమైనాయి. గూడూర్, కొడిచర్ల, ఇన్ముల్‌నర్వ, మల్లాపూర్ జీపీలలో ఒకటి చొప్పున ఏకగ్రీవమైనాయి. మక్తగూడలో 7, మల్లాపూర్‌తండాలో 5, పెంజర్లలో 4, వైఎం తండాలో 2 వార్డులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మక్తగూడ గ్రామపంచాయతీలో 8వార్డులు ఉండగా, 7వార్డులు ఏకగ్రీవం కాగా, ఒక వార్డుకు పోటీ నెలకొని ఉంది.

కాగా, గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డుసభ్యులకు నామినేషన్లు వేసిన పర్వంలో బుధవారం ఉపసంహరణ తర్వాత ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు అధికారులు గుర్తులను కేటాయించారు. సిద్దాపూర్ సర్పంచ్ అభ్యర్థులుగా బాసునాయక్, రెడ్యానాయక్, వైఎం తండాలో మంజుల, ముత్యాలి, ఎస్‌బీ పల్లిలో సుమిత్ర మల్లారెడ్డి, ఎమ్మె యాదమ్మ, కొడిచర్లలో కవితా కిరణ్, దాసరి యాదమ్మ, దయ్యాల నర్సమ్మ, కొడిచర్లతండాలో లక్ష్మీశంకర్, శాంతివిష్ణు, పెంజర్లలో ఎర్రోళ్ల జగన్, బ్యాగరి రాజు, దేశాల అంజమ్మ, సుధాకర్, భీమయ్య, రాములు, తీగాపూర్‌లో జయప్రద జగన్ మోహన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కుమార్, మల్లాపూర్‌లో నర్సింహారెడ్డి, చిన్నారెడ్డి, మల్లాపూర్‌తండాలో అనితా రాజునాయక్, మీనాక్షి ధశరథ్, రాధా లక్ష్మణ్, గూడూర్‌లో దయానంద్ గుప్త, రాజుగౌడ్, ఆంజనేయులు ముదిరాజ్, మక్తగూడలో శ్రీరాములు, వడ్డే శేఖర్, ఇన్ముల్‌నర్వలో ఆగీర్ రవికుమార్‌గుప్త, లావుడ్యా గోపాల్ ఎన్నికల బరిలో ఉన్నారు. మొత్తం 12 గ్రామపంచాయతీలకు గాను 32మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

పంచాయతీ పోరు..
కొత్త పుంతలు

ప్రచారాస్త్రంగా సోషల్ మీడియా
- వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాల్లో ఓట్లడుగుతున్న అభ్యర్థులు
- కనిపించని పోస్టర్లు, వాల్ రైటింగ్స్, డోర్ స్టిక్కర్లు

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో అభ్యర్థులు ట్రెండ్ మార్చారు. స్మార్ట్ ఫోన్లతో ప్రచారాన్ని సాగిస్తున్నారు. డిజిటల్ మీడియా ప్రమోషన్లతో పంచాయతీ ఎన్నికలను కొంత పుంతలు తొక్కుతున్నారు. ప్రచారానికి సోషల్ మీడియాను విస్తృతంగా వాడుతున్నారు. వీడియోలతో ఎన్నికల పాటలు, సందేశాలు చిత్రీకరించి అప్లోడ్ చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో, వ్యక్తిగతంగా, ఫేస్‌బుక్, ఇన్‌స్టగ్రామ్, ఏఐలను వినియోగించి సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులు ఓట్లను అభ్యర్థిస్తున్నారు. పార్టీల తరపున వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి అభ్యర్థుల ఫొటోలను, గెలిపిస్తే గ్రామానికి చేసే సేవలు, అభివృద్ధి పనులపై వివరిస్తున్నారు. ఫోన్లతో వాయిస్ రికార్డులను పంపిస్తున్నారు. ఆమనగల్లు మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు సోషల్ మీడియా ప్రచారాన్ని విస్తృతంగా చేస్తున్నారు. గతంలో పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు వాల్‌పోస్టర్లు, డోరు పోస్టర్లు, పాంప్లెట్లు, గుర్తులతో ప్రచారం వంటి వాటికి స్వస్తి పలికారు. చేసినా



చాలా తక్కువ స్థాయిల్లో ఇలాంటి ప్రచారం ఉంది.

ఖర్చు తక్కువ.. ప్రయోజనం ఎక్కువ!

స్మార్ట్‌ఫోన్ల వినియోగం ఎక్కువైంది. ప్రతిదానికి ఫోన్‌నే వాడుతున్నారు. ఇది ఎన్నికల్లో పోటీచేస్తున్న వారికి కలిసొస్తోంది. సోషల్ మీడియా ద్వారా కేవలం ఫోన్లో డేటా ఉంటే చాలు.. తాము చెప్పాలనుకుంటున్నది ప్రజలకు చేరవేస్తూ అభ్యర్థులు ఎన్నికల ఖర్చును సైతం తగ్గించుకుంటున్నారు. అభ్యర్థులు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. ఈ గ్రూపులను కూడా కులాలు, వార్డులు, యువజన, మహిళా సంఘాల వారీగా ఏర్పాటు చేసి ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనుల్లో ఉంటున్నారు. తమను గెలిపిస్తే సంఘాలకు, వార్డులకు, కుల సంఘాలకు చేసే ప్రయోజనాన్ని పోస్ట్ చేస్తున్నారు. మరికొందరు అభ్యర్థులు మరో అడుగు ముందుకేసి ఓటర్ల ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్లను కూడ సేకరిస్తున్నట్లు సమాచారం.

ప్రింటింగ్ ప్రెస్‌లకు తగ్గిన గిరాకీ

డిజిటల్, సోషల్ మీడియా రాకతో ప్రింటింగ్ ప్రెస్‌లకు గిరాకీ తగ్గింది. గతంలో ఎన్నికలొచ్చాయంటే చేతినిండా పని దొరికేది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గిరాకీ రెట్టింపయ్యేది. అయితే ప్రస్తుత పరిస్థితులు తలకిందులయ్యాయి. సోషల్ మీడియా, డిజిటల్ డిస్ప్లే, ఫ్లెక్సీల రాకతో ప్రిటింగ్ ప్రెస్‌ల వైపు చూసే వారే కరువయ్యారు.

ఎన్నికల్లో సమాన ఓట్లొస్తే...



బషీరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల్లో ఒక్కరి కంటే ఎక్కువ మందికి సమాన ఓట్లు వస్తే విజేతగా ఎవరిని ప్రకటిస్తారనే అనుమానం ప్రజలు, అభ్యర్థుల్లో ఉంటుంది. ఈ క్రమంలో అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చినప్పుడు అభ్యర్థుల పేర్లు రాసి డ్రా తీసి విజేతను ప్రకటిస్తారు. ఇది ఎన్నికల నియమావళిలో పొందుపర్చారు కూడా. సమాన ఓట్లొచ్చిన అభ్యర్థుల పేర్లను ఒకే రంగు, పరిమాణం కలిగిన ఐదేసి చిట్టీల్లో రాస్తారు. గుర్తు పట్టరాకుండా వాటిని కలుపుతారు. అభ్యర్థుల ఎదుటే అందులోంచి రిటర్నింగ్ ఆఫీసర్ ఒక్క చిట్టీ తీసి విజేతను ప్రకటిస్తారు. ఈ విషయంలో ఆర్వోకే ఎన్నికల సంఘం అధికారం ఇచ్చింది. ఆర్వో ఒక్కసారి విజేతను ప్రకటించిన తరువాత మార్పు ఉండదు. అయితే ఇదంతా పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంటుంది.

పోస్టల్ బ్యాలెట్ పొందడమెలా?

కొత్తూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల వేళ మొదటి విడతలో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గంలోని 6మండలాలకు చెందిన గ్రామపంచాయతీలకు ఈనెల 11న ఎన్నికలు జరుగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు బుధవారం చివరి రోజు కావడంతో పలువురు అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకున్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కూడా కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేవారు కింది నియమ నిబంధనలు పాటించాలి. అన్ని మండల కేంద్రాలలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉండే ఎన్నికల స్టేజీ-2 అధికారి నుంచి పోస్టల్ బ్యాలెట్ పొందవచ్చును. ప్రభుత్వ ఉద్యోగికి ఎన్నికల డ్యూటీ ఉన్నట్లయితే, సంబంధిత అధికారి చేత ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఎన్నికల డ్యూటీ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకొచ్చి దరఖాస్తు పూర్తి చేసి స్టేజీ-2 ఎన్నికల అధికారికి అందజేసి పోస్టల్ బ్యాలెట్‌ను పొందవచ్చును. ఏ మండలానికి చెందినవారు ఆ మండలంలోనే పోస్టల్ బ్యాలెట్‌ను పొందాలి. రేపటి నుంచి ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా పొందవచ్చని తెలిపారు.

విలీనం.. అధికారికం

జీఓ 264పై పురపాలక శాఖ ఉత్తర్వులు.. జీహెచ్ఎంసీలోకి మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు
రంగంలోకి బల్దియా.. రికార్డుల స్వాధీనం.. బ్యాంకు ఖాతాల స్తంభన.. డీఎంసీలకు బాధ్యతలు
రాత్రే కార్యాలయాలకు అధికారులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో శివార్లలోని 20 మునిసిపాల్టీలు, ఏడు కార్పొరేషన్ల విలీనం అధికారికంగా పూర్తయ్యింది. ఈ మేరకు పురపాలక శాఖ బుధవారం ఉత్తర్వులు (జీఓ-264) జారీ చేసింది. ఈ నేపథ్యంలో పట్టణ స్థానిక సంస్థల కౌన్సిల్ తీర్మానాలు, మినిట్స్ బుక్ సీజ్, బ్యాంకు ఖాతాల స్తంభింప చేసి అందులోని డబ్బులను జీహెచ్ఎంసీ ఖాతాలోకి బదిలీ, కార్యాలయాలకు జీహెచ్ఎంసీ పేరిట బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. 30 మంది డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ల (డీఎంసీ)లకు బాధ్యతలు అప్పగిస్తూ సాయంత్రం 6 గంటల సమయంలో ప్రొసీడింగ్స్ రాగా.. రాత్రే డీఎంసీలు రంగంలోకి దిగారు. ఆయా సంస్థల కార్యాలయాలకు వెళ్లి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాల ఫ్రీజ్‌కు లేఖలు సిద్ధం చేశారు.

రికార్డుల స్వాధీనం

నిర్మాణ అనుమతులు జారీ చేయకుండా, బిల్లులు చెల్లించకుండా పాలనా వ్యవహారాలను స్తంభింప చేశారు. మునిసిపాలిటీ స్వరూపం, ఉద్యోగులు, సిబ్బంది వివరాలు, స్థిర, చరాస్తులు, డిపాజిట్లు, పెట్టుబడులు, పన్నులు, పన్నేతర ఆదాయం, ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలు, చేపట్టిన పనులు, చెల్లించాల్సిన బిల్లులు, మూడేళ్లలో జారీ చేసిన భవన నిర్మాణ/లే అవుట్ అనుమతుల జారీ వివరాలు సేకరించాలని ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్నారు. రికార్డులు స్వాధీన ప్రక్రియను పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్లకు సూచించారు. మునిసిపాల్టీలు, కార్పొరేషన్ల రికార్డుల స్వాధీనం, డేటా బదిలీకి సహకరించాలని మంగళవారమే కర్ణన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు లేఖ రాశారు. వివరాల సేకరణ, రికార్డుల స్వాధీనానికి సంబంధించి ప్రొఫార్మను ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. విలీన మునిసిపాల్టీలకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించనున్నారు. మునిసిపాలిటీ ఏర్పాటు? విస్తీర్ణం, గ్రేడ్, 2001, 2011 లెక్కల ప్రకారం జనాభా, ప్రస్తుతం ఉన్న కుటుంబాలు, వార్డులు, మురికివాడలు, ఉద్యోగులు, మూడేళ్లుగా ఆదాయ, వ్యయాలు, మార్కెట్లు, తదితర వివరాలన్నీ ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్న ఫార్మాట్‌లో సేకరించాలని సూచించారు. పూర్తి వివరాల సేకరణ నేడు లేదా రేపు పూర్తవుతుందని ఓ అధికారి తెలిపారు.



జోన్లలో కలిసిన మున్సిపాల్టీల వివరాలు

చార్మినార్ జోన్
- ఆదిభట్ల, బడంగ్ పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయాంజాల్

శేరిలింగంపల్లి జోన్
- బండ్లగూడ జాగీర్, మణికొండ, నార్సింగి, అమీన్‌పూర్, తెల్లాపూర్

ఎల్‌బీనగర్ జోన్
- మీర్‌పేట్, పెద్దఅంబర్‌పేట, తుక్కుగూడ, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పిర్జాదిగూడ, పోచారం

సికింద్రాబాద్ జోన్
- బోడుప్పల్, జవహర్‌నగర్, నాగారం, తూంకుంట

కూకట్‌పల్లిజోన్
- దుండిగల్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, మేడ్చల్, నిజాంపేట్, బొల్లారం

బంగారం కోసమే వృద్ధురాలి హత్య

పూడూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బంగారం కోసమే వృద్ధురాలిని హత్య చేశారని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వెల్లడించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. చెన్‌గోముల్‌కు చెందిన బేగరి రాములమ్మ(80) గత నెల 18న తప్పిపోయింది. 21న ఆమె కుమారుడు నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా 24న గ్రామంలోని జలీల్‌మియాకు చెందిన పాడుపడిన ఇంట్లో రాములమ్మ శవాన్ని నర్సింహులు గుర్తించాడన్నారు. రాములమ్మ చేతికి ఉన్న వెండి గాజులు, మెడలోని బంగారు గుండ్లు కన్పించలేదన్నారు. సీసీ పుటేజీల ద్వారా అనుమానితుడు బెల్కటూర్ నరేష్ అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. పథకం ప్రకారం 18న మధ్యాహ్నం రాములమ్మ వద్దకు మెహర్ అనే వ్యక్తి వచ్చాడు. అతడు నరేష్, భూతుల్‌లకు ఫోన్‌చేసి పిలిపించారు. ఇలా ముగ్గురు కలిసి రాములమ్మను మాటల్లో దింపి గొంతునులిమి చంపారన్నారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు గుండ్లు, వెండి గాజులు, ముక్కు పుడకను తీసుకుని గోనెసంచిలో శవాన్ని కట్టి అదేరోజు రాత్రి జలీల్‌ఖాన్ పాత ఇంట్లో పడేశారని ఎస్పీ వివరించారు. నిందితుల నుంచి ఆభరణాలు, హతురాలి ఇతర వస్తువులను స్వాధీన చేసుకున్నామని చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు.

ఉల్లంఘనలపై టీజీపీసీబీ ఉక్కుపాదం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై తెలగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉక్కుపాదం మోపుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలతో పాటు నగర శివారులోని 49 పరిశ్రమలపై గత నవంబరు నెలలో ఆరోపణలు రాగా, టాస్క్‌ఫోర్సు అధికారులు తనిఖీలు నిర్వహించి పీసీబీకి నివేదిక సమర్పించారు. ఆయా నివేదికల ఆధారంగా తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన ఆరు పరిశ్రమలకు మూసివేత ఉత్తర్వులు జారీచేసినట్లు పీసీబీ ఉన్నతాధికారులు బుధవారం ప్రకటించారు. మూసివేత/ఉత్పత్తి నిలిపివేత ఉత్తర్వులు జారీ అయిన పరిశ్రమల్లో రంగారెడ్డి జిల్లా నాగులపల్లికి చెందిన స్వర్ణా ప్లాస్టిక్, నల్గొండ జిల్లా దేవరకొండ సమీపంలోని వెంగమాంబ మైనింగ్ కంపెనీ, సిరిసిల్ల జిల్లాకు చెందిన గాజుల ఉమాకాంత్ ఫాబ్రిక్ డైయింగ్ యూనిట్, యాదాద్రి జిల్లా చౌటుప్పల్ సమీపంలోని సహస్ర ఎన్విరో ప్రైవేటు లిమిటెడ్, సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని టీఈడబ్ల్యు ఆటోమేషన్ లిమిటెడ్, సిద్దిపేట్ జిల్లా బస్వాపూర్ గ్రామంలోని ఆశీర్వాద్ మెటల్ ఇండస్ట్రీలు ఉన్నట్లు టీజీపీసీబీ స్పష్టం చేసింది.

కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు

యాచారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) కార్మికులు, కర్షకుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని, కేవలం దినసరి వేతనంతోనే జీవనం సాగిస్తున్న కార్మికులను ఆదుకోవడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. ఈనెల 7, 8, 9వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి సీఐటీయూ మహాసభలకు సంబంధించి పోస్టర్‌ను యాచారం మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. భూపాల్ మాట్లాడుతూ సులభతర వాణిజ్య పేరుతో ప్రపంచ పెట్టుబడిదారులకు విధానాలను పాలకులు అవలంభించడం దారుణమన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తుంటే ఎందుకు పట్టించకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రుద్రకుమార్, ఎం.చంద్రమోహన్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్, జిల్లా కోశాధికారి కవిత, ఉపాధ్యక్షులు జగదీష్, కిషన్, మండల కార్యదర్శి చందూనాయక్ పాల్గొన్నారు.


యాచారం : పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

మహాసభలను జయప్రదం చేయాలి

పూడూరు/యాలాల/తాండూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఐదో మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం పూడూరులో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మెదక్‌లో రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. లేబర్ కోడ్లను రద్దుచేసే కార్మికులంతా ఏకతాటిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో వనజ, ఉమాదేవి, ఆండాలు, పుష్ప, అలీ, నర్సింహులు, రాములు పాల్గొన్నారు. సీఐటీయూ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తాండూరులో ఆవిష్కరించారు. రాజీలేని పోరాటాలతోనే కార్మిక హక్కులను కాపాడుకుంటామన్నారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

మహేశ్వరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా చారిత్రక ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. తుక్కుగూడ మున్సిపాలిటీలోని జెన్నాయిగూడ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా రావిరాలకు చెందిన కోటగళ్ల రంజిత్ కుమార్‌తో పాటు డైరెక్టర్లుగా నియమితులైన నారాయణరెడ్డి, సుప్రియ, రవీందర్, దర్శన్‌లతో బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆయన ప్రమాణం చేయించారు. చైర్మన్ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ చారిత్రాత్మక ఆలయాల అభివృద్ధికి పాలక వర్గంతో కలిసి కృషి చేయనున్నట్లు తెలిపారు. పాలక వర్గం ఎన్నికకు సహకరించిన కేఎల్లార్‌తో పాటునాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.


ఆలయ కమిటీతో ప్రమాణం చేయిస్తున్న కేఎల్లార్

బీజేపీ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్
- ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్ హెచ్చరించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కంసాన్‌పల్లి గ్రామ పంచాయతీ వార్డుకు నామినేషన్ వేసి, రైలు పట్టాలపై అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఆవ శేఖర్ అంతిమ యాత్ర బుధవారం సాయంత్రం గ్రామంలో జరిగింది. ఈమేరకు హాజరైన రాజ్‌భూపాల్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. వార్డు సభ్యుడిగా గెలుపొంది కాంసాన్‌పల్లిలో బీజేపీని బలోపేతం చేయాలన్న ఆశయంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన శేఖర్‌ను తన నామినేషన్ ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ఆ గ్రామ నాయకుల వల్లనే శేఖర్ మరణించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు రాజకీయ ఒత్తిడికి లొంగకుండా నిష్పక్షపాతంగా శేఖర్‌ది ఆత్మహత్యనా? లేక హత్యనో తేల్చాలని డిమాండ్ చేశారు. ఆయన మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శేఖర్ మరణానికి కారణమైన వారిని ఈనెల 11 లోపు అరెస్టు చేయకపోతే షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌తో పాటు డీసీపీ ఆఫీసును ముట్టడిస్తామని రాజ్‌భూపాల్‌గౌడ్ హెచ్చరించారు. బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణ, హరిభూషణ్‌పటేల్, సుధాకరప్ప, గణేష్, రాము తదితరులున్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

బొంరాస్‌పేట్/తాండూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్లకుంటలో వరి, కంది పంటలను వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలతో సాగుచేయాలన్నారు. రైతు ఉన్నతికి నాణ్యమైన విత్తనాలే వాడాలని శాస్త్రవేత్తలు ప్రతి నిధులు పేర్కొన్నారు. తాండూరు మండలం బెల్కటూర్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. నాణ్యమైన విత్తనం వాడితే 15 నుంచి 20శాతం పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తాండూరు ఇన్‌చార్జి ఏడీ కొమురయ్య, ఏఈవోలు శ్రీను, రఘు వంశీ, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమరానికి సై

(ఐదో పేజీ తరువాయి)

ఎరవేశారు. కొన్ని చోట్ల పోటీ తగ్గించుకునేందుకు బరిలో ఉన్న కొందరిని చివరి క్షణంలో విరమింపచేసి కొందరు అభ్యర్థులు పైచేయి సాధించారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజైన బుధవారం అనేక చోట్ల అభ్యర్థులు తమ ప్రత్యర్థులను బరిలో నుంచి తప్పించేందుకు శతవిధాలుగా ప్రయత్నించారు. అయితే జిల్లాలో కేవలం ఆరు చోట్ల మాత్రమే ఏకగ్రీవాలయ్యాయి. ఇవన్నీ కూడా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోనివే.. ఏకగ్రీవమైన ఆరు చోట్లలో నాలుగు చోట్ల అధికార పార్టీ మద్దతుదారులు ఉండగా మరో రెండు చోట్ల బీఆర్ఎస్ మద్దతుదారులు ఉండడం గమనార్హం.

గుర్తులతో ఇంటింటికీ..

తొలి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో పూర్తిస్థాయిలో ప్రచార పర్వం మొదలు కావడంతో గ్రామాల్లో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నప్పటికీ పల్లెల్లో పట్టుకోసం ఆయా పార్టీలు తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో పట్టుసాధిస్తే తర్వాత జరిగే పరిషత్ ఎన్నికల్లో సులువుగా విజయం సాధించవచ్చని భావిస్తున్న రాజకీయ పార్టీలు ప్రతి గ్రామంలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో సామాజిక, ఆర్థిక అంశాలు ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. కులాల వారీగా ఓట్ల సమీకరణ జరుగుతోంది. అభ్యర్థులు పోల్‌మేనేజ్‌మెంట్‌కు ప్రతి 100 ఓట్లకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. అభ్యర్థుల గుర్తులను విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఇంటింటికీ వెళ్లేయత్నం చేస్తున్నారు. తమ గుర్తులను కరపత్రాలు, ఇతర వస్తువులపై ముద్రించేందుకు అందుబాటులో ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌లకు వెళ్లి ఆర్డర్స్ ఇస్తున్నారు. బుధవారం రాత్రే కొందరు బ్యాలెట్ పత్రాల నమూనా, తమ గుర్తులను ముద్రించుకొని ఎన్నికల ప్రచారం మొదలెట్టారు.

మూడో విడత పంచాయతీ నామినేషన్లు

ప్రశాంతంగా నామపత్రాల దాఖలు



మాడ్గుల : నల్లచెరువు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కట్ట సహన



యాచారం : మంతన్‌గౌరెల్లిలో సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేస్తున్న అరవింద్‌నాయక్

ఆమనగల్లు/మాడ్గుల/మహేశ్వరం/కందుకూరు/యాచారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడత నామినేషన్‌ల పర్వం బుధవారం ప్రారంభమైంది. ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మాడ్గుల మండలంలో నామినేషన్‌ల స్వీకరణకు 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా క్లస్టర్ కేంద్రాల వద్ద సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లా సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయలక్ష్మి పర్యవేక్షణలో నామినేషన్‌ల స్వీకరణ తొలి రోజు ప్రశాంతంగా జరిగింది. నామినేషన్‌ల తొలి రోజు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు తక్కువ సంఖ్యలో నామినేషన్‌లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీల మద్దతు అభ్యర్థులు తమ పార్టీ నేతలతో వచ్చి నామినేషన్‌లు దాఖలు చేశారు. మాడ్గుల మండలంలో 34 గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవులకు, 302 వార్డుసభ్యులకు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, మహేశ్వరంలో మొదటిరోజు నామినేషన్ల పర్వం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు మహేశ్వరం ఎంపీడీవో శైలజ తెలిపారు. కందుకూరులో 35 గ్రామ పంచాయతీలు, 312 వార్డు సభ్యులకుగాను నామినేషన్లు ప్రారంభమైనట్లు ఎంపీడీవో సరిత తెలిపారు. అలాగే యాచారం మండలంలో మొదటి రోజు సర్పంచ్, వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. పది క్లస్టర్లు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ నందీశ్వర్‌రెడ్డి వివిధ గ్రామాల్లో పరిస్థితిని సమీక్షించారు. పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు పెట్టుకోరాదన్నారు.. మద్యం, డబ్బు పంపిణీ చేసి ఓటర్లను ప్రభావితం చేయరాదని యాచారం, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు హెచ్చరించారు.త

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

శంషాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రంలోని పలు ప్రాంతాల్లో నేడు(గురువారం) మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ అఫ్సర్‌బాషా ప్రకటనలో తెలిపారు. ధర్మగిరి అగ్రికల్చర్ ఫీడర్ చారీనగర్, గ్రీన్‌క్యాపిటల్, సూరజ్‌గార్డన్, మెహదీగార్డన్, కల్లు కాంపౌండ్, రుద్రకాలనీ, జెండాచౌరస్తా, రైల్వేస్టేషన్‌రోడ్డు బస్తీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

యాచారం మండల పరిధిలో..

యాచారం : మండలంలోని చిన్నతూండ్లలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం మరమ్మతుల కారణంగా కరెంటు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ సుధీర్ పేర్కొన్నారు. చిన్నతూండ్ల, దర్మన్నగూడలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుల రిమాండ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించారు ఆర్జీఐఏ పోలీసులు. సీఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. సిద్ధాంతి బస్తీకి చెందిన సౌదయ్య మంగళవారం దారుణ హత్యకు గురైన సంఘటన తెలిసిందే. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. అదే బస్తీకి చెందిన అబ్దుల్ జావిద్(29) మరో 14 ఏళ్ల బాలుడు ఇద్దరు కలిసి వృద్ధుడిని బండరాయితో మోది హత్య చేశారని పోలీసులు తెలిపారు. వారి ఇంటిపక్కనే ఉంటున్న సౌదయ్య నిత్యం తిట్టేవాడని, అందుకోసమే హత్య చేశారని పోలీసులకు వివరించారు. ఈమేరకు బుధవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరి అదృశ్యం.. కేసు నమోదు



ఎండీ తబ్‌రేజ్, తౌహీద్ ఆలమ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలోని తొండుపల్లి గ్రామంలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తొండుపల్లికి చెందిన ఎండీ తబ్‌రేజ్, ఎండీ తౌహీద్ ఆలమ్‌లు కలిసి తొండుపల్లి గ్రామ పరిధిలో ఫైవుడ్ డోర్స్‌కు సంబంధించిన గోదాంలో గత రెండు సంవత్సరాలుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గోదాం యజమాని సుఖ్‌రామ్ పని నిమిత్తం మహబూబ్‌నగర్‌కు వెళ్లాడు. రాత్రి 9 గంటలకు తన వద్ద పని చేస్తున్న ప్రేమ్‌కుమార్ సుక్‌రామ్‌కు ఫోన్ చేసి ఇద్దరు వ్యక్తులు గోదాం నుంచి బజాజ్ చేతక్ వాహనం తీసుకొని వెళ్లారని, తిరిగి రాలేదని సమాచారం అందించాడు. దీంతో యజమాని సుక్‌రామ్ ఎండీ.తబ్‌రేజ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉంది. ఆచూకీ కోసం చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. దాంతో బుధవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో యజమాని సుక్‌రామ్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం సీజ్

శంకర్‌పల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన మల్లేషం కారులో వెయ్యి లీటర్ల మద్యాన్ని శంకర్‌పల్లి నుంచి అక్రమంగా తరలిస్తుండగా బుధవారం మహాలింగపురం ఎల్లమ్మగుడి వద్ద పట్టుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు..

శంకర్‌పల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మహాలింగపురం గ్రామంలో మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చేకూర్ హర్షవర్ధన్‌రెడ్డి తన ఇంట్లో అక్రమంగా 20లీటర్ల మద్యాన్ని నిల్వ ఉంచారు. పక్కా సమాచారంతో బుధవారం పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. హర్షవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ముగిసిన రెండో విడత నామినేషన్ల పర్వం

పలుచోట్ల సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవం



షాద్‌నగర్ అర్బన్ : ఏకగ్రీవ సర్పంచ్ గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధిలో 69 సర్పంచ్ పదవులకు 444 నామినేషన్లు, 594 వార్డులకు 1781 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆమనగల్లు మండలంలో 13 సర్పంచ్ పదవులకు 86 నామినేషన్లు, 112 వార్డులకు 336, తలకొండపల్లి మండలంలో 32 సర్పంచ్‌లకు 205 నామినేషన్లు, 272 వార్డులకు 742 నామినేషన్లు, కడ్తాల మండలంలో 24 సర్పంచ్‌లకు 153 నామినేషన్లు, 210 వార్డులకు 703 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు మాధురి, శ్రీకాంత్, సుజాతలు తెలిపారు. ఆమనగల్లు మండలం కోనాపూర్, కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండా, రేఖ్యా తండా, తలకొండపల్లి మండలం బల్లులపల్లి పంచాయతీ సర్పంచ్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఏకగ్రీవమయ్యాయి. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

చౌదరిగూడ : చౌదరిగూడ మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గాను 120మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లే వేయగా అందులోంచి 52 మంది ఉపసంహరించుకున్నారు. సర్పంచ్ పోటీలో 68మంది ఉన్నారు. 204 వార్డులకుగాను 469 మంది నామినేషన్లు వేయగా 39మంది ఉపసంహరించుకున్నారు. బరిలో 430 ఉన్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని 47 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థుల, వార్డు సభ్యుల ఎన్నికకు తుది జాబితా వెలువడింది. నామినేషన్ల ఉప సంహరణ ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. 47 గ్రామ పంచాయతీలకుగాను 152మంది పోటీలో ఉన్నారు. 410 వార్డులకు 945 మంది పోటీలో ఉన్నట్లు ఎంపీడీఓ బన్సీలాల్ తెలిపారు.

నందిగామ : 19 గ్రామపంచాయతీలకు పలువురు అభ్యర్థులు ఉపసంహరించుకున్న తర్వాత 54మంది సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. 170 వార్డు సభ్యులకు గాను 401 మంది బరిలో ఉన్నారు. కన్హా గ్రామపంచాయతీ పాలకవర్గం సర్పంచ్‌తో పాటు 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం అయినట్లు అధికారులు తెలిపారు. బుగ్గోనిగూడ గ్రామపంచాయతీ పరిధిలో 4వ వార్డు, చాకలిగుట్టతాండా గ్రామపంచాయతీ పరిధిలోని 5వ వార్డు, రంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 7వ వార్డు ఏకగ్రీవం అయ్యినట్లు అధికారులు తెలిపారు.

మొయినాబాద్ రూరల్ : సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు వచ్చిన నామినేషన్లను అధికారులు పరిశీలించిన తరువాత ఎటువంటి తిరస్కరణ కాలేదని ఎంపీడీవో సంధ్యరాణి తెలిపారు. 19 సర్పంచ్, 166 వార్డు స్థానాలకు నామినేషన్ల పత్రాలను స్వీకరించినట్లు చెప్పారు. సర్పంచ్‌కి 110, వార్డు స్థానాలకు 590 నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు.

షాద్‌నగర్ అర్బన్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని అయ్యవారిపల్లి గ్రామాభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. అయ్యవారిపల్లి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గొటికె గోపాల్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మద్దతిచ్చిన గోపాల్‌రెడ్డితో పాటు మరో ఐదుగురు వార్డు సభ్యులుగా ఏకగ్రీవమైనారు. వారందరినీ ఎమ్మెల్యే సన్మానించారు.

కందుకూరు : దావుత్‌గూడ గ్రామ సర్పంచ్‌గా ముడావత్ హనుమంత్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి గ్రామస్తులు తీర్మానించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మండలంలోని 35 గ్రామ పంచాయతీలు, 312 వార్డులకు సంబంధించి బుధవారం నామినేషన్‌లు వేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. దావుత్‌గూడలో 8 వార్డులతో పాటు సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి తీర్మానించారు. గ్రామంలో ఆంజనేయస్వామి, సేవాలాల్ మందిరం నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హనుమంత్‌నాయక్ హామీ ఇచ్చారు.

రైస్ మిల్లర్ల దోపిడీ.. బియ్యం నూర్పిడిలో కోత

● తహసీల్దార్‌కు బాధితుడి ఫిర్యాదు

మంచాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్లు బియ్యం దోపిడీకి పాల్పడుతున్నారు. మంచాల మండల కేంద్రంలోని రైస్‌మిల్లులో బియ్యం దోపిడీని గుర్తించిన రైతు తనకు జరిగిన నష్టంపై అధికారులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. మంచాల గ్రామానికి చెందిన ఏర్పుల బాషయ్య బుధవారం 30 కుండల కొలతగల ధాన్యాన్ని స్థానికంగా ఉన్న రాఘవేంద్ర రైస్‌మిల్లులో నూర్పిడి చేయించాడు. అనంతరం రైతుకు 213 కిలోల బియ్యం, 20 కిలోల నూక కలిపి మొత్తంగా 233 కిలోలు చేతికి వచ్చింది. ఇంత తక్కువగా బియ్యం రావడంపై అనుమానం వచ్చిన రైతు.. రైస్‌మిల్లు నిర్వాహకులను ప్రశ్నించాడు. 40 కుండల ధాన్యం నూర్పిడి చేస్తే 4 క్వింటాళ్లకు పైగా బియ్యం వస్తుందని.. 30 కుండల ధాన్యం నూర్పిడి చేస్తే అందులో సగం వరకు(233 కిలోలు) రావడమేంటని నిలదీశాడు. అనంతరం తనకు జరిగిన అన్యాయంపై తహసీల్దారుకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు బాధిత రైతుకు చెప్పినట్లు తెలిపాడు.

'కాంగ్రెస్' విజయానికి సమష్టిగా పనిచేయాలి

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మహేందర్‌ను సన్మానిస్తున్న కసిరెడ్డి

కడ్తాల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గంలో మరో మారు కాంగ్రెస్ సత్తా చాటాలని కోరారు. కడ్తాల మండలం చరికొండ గ్రామ కాంగ్రెస్ నాయకులతో కల్వకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిగా పాలకుర్ల మహేందర్‌ను ప్రకటించి సత్కరించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి, సామాజిక న్యాయం సాధ్యమన్నారు. ప్రగతిని కాంక్షించే వారంతా పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి రావాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 90 శాతం స్థానాలు కాంగ్రెస్ అభ్యర్థులు కైవసం చేసుకుంటానపి తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధుల కేటాయింపులో వివక్షత చూపుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు పాలకుర్ల రాములు, నాయకులు రౌతు వెంకటయ్య, సంగెం సత్తయ్య, ఈర్లపల్లి మహేశ్, తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌గా గెలిపిస్తే కడ్తాల ప్రజల గొంతుకనవుతా



కడ్తాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బావండ్లపల్లి ఆనంద్

కడ్తాల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కడ్తాల గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా తనను ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్ అన్నారు. సర్పంచ్‌గా గెలిపిస్తే కడ్తాల గొంతుకగా ప్రజా సమస్యలపై గళం విప్పుతానని ఆయన తెలిపారు. కడ్తాల సర్పంచ్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బావండ్లపల్లి ఆనంద్ బుధవారం పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంప శ్రీనులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. కడ్తాల మండల వైస్ ఎంపీపీగా పనిచేసిన తనకు.. ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. సర్పంచ్‌గా అవకాశం ఇస్తే ప్రజలు కోరుకున్న విధంగా నిస్వార్థ సేవలందిస్తానని చెప్పారు. పదవులు ఉన్నా లేకపోయినా దశాబ్దాల కాలంగా కడ్తాల ప్రజలమధ్యే ఉంటూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కడ్తాల ఎంతో ప్రగతి సాధించిందని రెండేళ్ల కాలంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించక ప్రభుత్వం కాలయాపన చేయడం వల్ల స్థానికంగా ఎన్నో సమస్యలు నెలకొన్నాయని అన్నారు. వాటి పరిష్కారానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, బీఆర్ఎస్ అగ్రనేతలతో కలిసి కడ్తాల సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధుల మంజూరుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఆనంద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, లాయక్‌అలీ, బాలయ్య, గణేశ్, మహేశ్, వెంకటేశ్, యాదయ్య, అంజి, సైదులు, శ్రీకాంత్, క్యామ వెంకటేశ్, సురేశ్, శ్రీనివాస్, మహేశ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



అవ్వా.. నీ ఓటు నాకే అంటూ బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థి ఆనంద్

వామ్మో ఈగలు

(ఐదో పేజీ తరువాయి)

ఇంటిలో ఈగలు ముసురుకుంటున్నాయని, ఎక్కడ చూసినా ఈగలే కనిపిస్తున్నాయని గ్రామస్తులు ఆరోస్తున్నారు. గ్రామంలో ఇటీవల 50 మందికి పైగా యువకులు అయ్యప్ప మాల వేశారు. రోజూ అల్పాహారం, భోజనం వండి తినాలంటే ఎదుర్కొంటున్నారు.

అధికారులకు విన్నవించినా..

ఈగల బెడదపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సరిత, తహసీల్దార్ కె.గోపాల్‌కు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చిన ఈ గల బెడదను తగ్గించలేక పోతున్నట్లు గ్రామస్తులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఫౌల్ట్రీ యజమాని రాష్ట్ర స్థాయిలో రాకీయంగా, ఆర్థికంగా ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ పట్టించుకోకపోతే గ్రామాన్ని వదిలి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఈగలు వాలిన అన్నం ఎవరైనా తింటారా..



మా గ్రామంలో 58 మందిమి అయ్యప్ప మాల వేశాం. ముసురుకుంటున్న ఈగలతో వేగలేకపోతున్నాం. రాజరాజేశ్వరి ఆలయం వద్ద భిక్ష చేస్తున్నాం. వంట గిన్నెలపై వందల సంఖ్యలో ఈగలు వాలుతున్నాయి. ఈగలు వాలిన అన్నాన్ని ఎవరైనా తింటారా? అంటురోగాల భారిన పడుతున్నాం.

- సొడపు శేఖర్‌గౌడ్, అయ్యప్ప స్వామి, కొత్తగూడ

శ్రీకాంతాచారికి ఘన నివాళి

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతా చారికి ఘనంగా నివాళులర్పించారు. 16వ వర్ధంతిని పురష్కరించుకొని షాద్‌నగర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి కోరారు.

హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కేశంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ సాంస్కృతిక శాఖ జిల్లా కో-కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేష్, కుమార్ గుప్తాతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేసినట్లు ఇతర మతాల దేవళ్లపై చేస్తాడా? అని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

మహేశ్వరం/కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. బుధవారం తుక్కుగూడలో టీఎస్ యూటీఎఫ్ మహేశ్వరం మండల శాఖ సమావేశం జరిగింది. మండల కమిటీ అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అంజద్‌పాషా, రేణుక, కోశాధికారిగా సీపీ నాయుడులను ఎన్నుకున్నారు. ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలని టీఎస్ యుటీఎఫ్ జిల్లా కోశాధికారి జగన్నాథ్ శర్మ అన్నారు. కందుకూరులో సంఘం మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. మండల శాఖ అధ్యక్షుడిగా జె.బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శిగా వి.మహేష్, ఉపాధ్యక్షులుగా ఆర్ జంగయ్య, సి.కళావతి, కోశాధికారిగా సీహెచ్ యాదయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.రవిని ఎన్నుకున్నారు.

అవకాశం ఇస్తే సేవకుడిగా పనిచేస్తా



కడ్తాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న రాయికంటి భిక్షపతి

కడ్తాల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కడ్తాల సర్పంచ్‌గా తనను ఆదరించి గెలిపిస్తే ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి అన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కడ్తాల కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన రాయికంటి భిక్షపతి బుధవారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో కడ్తాలను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతానన్నారు. కడ్తాల గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలపై తనకు సంపూర్ణ అవగాహన ఉందని, ఒక్కసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపుతానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు రాబడుతానని భిక్షపతి తెలిపారు. అన్ని వార్డుల్లో తాగు నీరు, మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జాతీయ రహదారిపై ఉన్న కడ్తాలలో బస్టాండ్, ప్రభుత్వ 30 పడకల ఆసుపత్రి, జూనియర్ కళాశాల ఏర్పాటు, 108 అంబులెన్స్ ఉప మార్కెట్ యార్డ్‌తో పాటు గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయించి వినియోగంలోకి తెస్తానన్నారు. కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ రెడ్డిలు పేర్కొన్నారు. అభివృద్ధిని కాంక్షించి ప్రజలంతా కాంగ్రెస్ అభ్యర్థి భిక్షపతిని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు అభ్యర్థించారు. నాయకులు యాదగిరి రెడ్డి, రాఘవులు, రంగారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణ రెడ్డి, వెంకటేశ్, రాజేశ్, బ్రహ్మాచారి, చందోజీ, సత్యం యాదవ్, జహంగీర్‌అలీ, మల్లేశ్‌గౌడ్, జహంగీర్‌బాబా, రాంచందర్ నాయక్,బుచ్చయ్య, కృష్ణ, యాదగిరిరెడ్డి, మల్లయ్య, శ్రీను, రమేశ్, మూడరవి, దే వేందర్‌గౌడ్, బోసు రవి, నరేశ్ నాయక్, బాను కిరణ్, ఇ మ్రాన్‌బాబా, వెంకటేశ్, సత్యం, మహేశ్, రాజేందర్ గౌ డ్, శ్రీకాంత్, మహేశ్, సందీప్, వినిల్ నాయక్, శ్రీశైలం, లక్ష్మణ్, మల్లేశ్, జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో గూడూరు శ్రీనివాస్ రెడ్డితో రాయికంటి భిక్షపతి

ఘనంగా మహా పడిపూజ



మల్కాపూర్‌లో గురుస్వాములను సన్మానిస్తున్న అయ్యప్ప స్వాములు

చేవెళ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపూర్ శివాలయంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇరుముడి మహా పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. మాలధరణ స్వాములు అయ్యప్పస్వామి విగ్రహానికి అభిషేకాదులు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో దేవాలయం ప్రాంగణం మారుమోగింది. అనంతరం భక్తులందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి ఉమాశంకర్‌రెడ్డి స్వామిని స్వాములు ఘనంగా సన్మానించారు. గురుస్వాములు సుబ్రహ్మణ్యం, జైపాల్, శివకుమార్, సురేష్, ఇంద్రసేనారెడ్డి పలువురు స్వాములు 41 రోజుల పాటు దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పూజదాతలు ఆంజనేయులు యాదవ్, మహేందర్‌యాదవ్, స్వాములు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం విజయానికి సోపానం

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యం విజయానికి సోపానమని మండల విద్యాధికారి పాండు అన్నారు. ఆమనగల్లు భవిత దివ్యాంగుల పాఠశాలలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు క్యారమ్, క్రికెట్, పరుగు పందెం, మ్యూజికల్ చైర్, చెంచా గోళీ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

చేవెళ్ల : పట్టణ కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల చిన్నారులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభచాటిన వారికి టీచర్లు అనిత, సువర్ణమాల బహుమతులందించారు. టీచర్లు, విద్యార్థులున్నారు.

షాబాద్ : దివ్యాంగులను అన్నిరంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. తాళ్లపల్లిలోని భవిత కేంద్రంలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. సీఆర్పీలు, టీచర్లు ఉన్నారు.

కేశంపేట : శరీరానికే వైకల్యమని.. మనసుకు కాదని, శరీరానికి వైకల్యం ఉన్నంత మాత్రనా దివ్యాంగులు బాధపడాల్సిన పనిలేదని కేశంపేట ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ అన్నారు. కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో కేశంపేట, మంగళగూడ, అల్వాల, నిర్ధవెల్లి, సంతాపూర్, బొదునంపల్లి, వేములనర్వ పాఠశాలల దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులిచ్చారు.

హామీలను అమలు చేయాలి

కందుకూరు : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధిష్ఠానం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచి ఇస్తామని హామీ ఇచ్చారని, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.